క్లుప్తంగా

నేడు పందిరి మహాదేవుడు వర్ధంతి

సీటీఆర్ఐ: కోటిలింగాలపేటలో గల పందిరి మహదేవుడు కోటిలింగాల సత్రం వ్యవస్థాపకుడు పందిరి మహదేవుడు వర్ధంతిని బుధవారం సత్రం ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పళ్లంరాజు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం పూజా కార్యక్రమం అనంతరం స్మార్త పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులకు వస్త్ర సమర్పణ, పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

అలరించిన డ్రీమ్స్ గ్రీన్ డే వేడుకలు



గ్రీన్‌కలర్ విశిష్టతను వివరిస్తున్న విద్యార్థులు

ధవళేశ్వరం: ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన గ్రీన్ డే వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రీన్ కలర్ ఉపయోగాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులు వివరించారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల వల్ల కలిగే ఉపయోగాలు వివరిస్తూ వాటి వేషధారణలో విద్యార్థులు పాల్గొన్నారు. గ్రీన్ కలర్ విశిష్టతను వివరిస్తూ విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌లలో కేవలం గ్రీన్ కలర్ కూరగాయలు, ఆకుకూరల వంటకాలనే తీసుకువచ్చారు. గ్రీన్ కలర్ విశిష్టతను వివరిస్తూ అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు డ్రీమ్స్ విద్యాసంస్థల చైర్మన్ అంగర రమేష్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, జి.విమలారోజి, కె.లలితాదేవి పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

ప్రకాశం నగర్: ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అభిషేకాలు, సాయంత్రం విశేష సామూహిక శాంతి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని దూళిపాళ మహాదేవమణి చక్కని వ్యాఖ్యానంతో విశ్లేషించారు. అనంతరం లక్ష పుష్పార్చన, అన్నసమారాధన జరిగాయి. నిర్వాహకులు మునునూరి అయ్యప్ప, దంటు సూర్యప్రతాప్, మల్లాది వెంకట రమణ మూర్తి, వెంట్రప్రగడ ఆదినారాయణమూర్తి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేమాని భాస్కర్‌కు అభినందన

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా నేమాని భాస్కర్ నియామకంపై ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ హర్షం వ్యక్తం చేసింది. సీనియర్ జర్నలిస్టుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విశేషమైన అనుభవం వున్న నేమాని భాస్కర్ ప్రభుత్వానికి, మీడియా, ప్రజలకు మధ్య వారధిగా సేవలు అందించగలరన్న ఆశాభావాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి వ్యక్తం చేశారు. గతంలో రాజమహేంద్రవరంలో ఆంధ్రభూమి బ్యూరోగా పనిచేస్తూ, ప్రెస్ క్లబ్ కార్యదర్శిగా పాత్రికేయుల సంక్షేమానికి సేవలు అందించారన్నారు.

విద్యార్థులకు రెడ్ క్రాస్ శిక్షణ

ప్రకాశం నగర్: నెహ్రూనగర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో జూనియర్ రెడ్ క్రాస్‌పై అవగాహన కల్పించారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆవిర్భావం, విధులు, జూనియర్ రెడ్ క్రాస్ వలంటీర్లు చేసే కార్యక్రమాలను వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ వై.ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ ఆపద సమయంలో ఎలాంటి సేవలు అందించాలో వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జీవిత సభ్యుడు బళ్లా శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం కేవీవీ సత్యనారాయణ, పాఠశాల రెడ్ క్రాస్ నోబల్ ఆఫీసర్ సీహెచ్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీల సమస్యలపై త్వరలో సదస్సు

సీటీఆర్ఐ: బీసీలు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు బీసీలకే సీట్లు ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సానబోయిన రామారావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సమస్యలపై త్వరలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజకవర్గాల్లో అర్హులైన బీసీ నాయకులకు పోటీకి అవకాశం కల్పించాలన్నారు. కేకే సంజీవరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

సీతానగరం: తణుకుకు చెందిన ఆచంట అవినాష్ (23) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు తెలిపారు. అవినాష్ కామెర్లతో బాధపడుతున్నాడు. జాతకం చెబుతారని తెలుసుకుని సోమవారం సీతానగరం వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున శివాలయం వద్ద పడిపోగా స్థానికులు బస్టాండ్ వద్దకు తీసుకువచ్చారు. మళ్లీ పడిపోగా అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం, మృతుడి తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సదరమ్ తీరు మారేనా!

- జీజీహెచ్‌లో దివ్యాంగుల అవస్థలు
- డబ్బులిస్తేనే పని అవుతోందని ఆరోపణలు



ఆర్థోపెడిక్ విభాగం వద్ద వేచి చూస్తున్న రోగులు

కంబాలచెరువు: ప్రత్యేక అవసరాలు కలవారు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పొందటానికి సదరమ్ సర్టిఫికెట్ తప్పనసరి. అయితే వాటి కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వస్తున్న దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. వారికి అందించే ధ్రువీకరణ పత్రాల జారీలో కొందరు వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, డబ్బులిస్తేనే పత్రం ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రిలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో సదరమ్ శిబిరాలు నిర్వహిస్తారు. ఆర్థోపెడిక్, నేత్ర, మానసిక, చెవి, ముక్కు, గొంతు విభాగాల్లో సదరస్ క్యాంపు నిర్వహిస్తున్నారు. వారానికి సుమారు 160 మంది బాధితులను పరీక్షించి ధ్రువపత్రాలు మంజూరు చేయాల్సి ఉంది. శిబిరానికి జిల్లావ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

పలు ఇబ్బందులు

సదరమ్ ధ్రువపత్రాల మంజూరుకు సంబంధించి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా మూడు నెలలకోసారి సదరమ్ స్లాట్లు విడుదల చేస్తారు. అందులో ఇచ్చిన తేదీకి ఆసుపత్రికి వెళ్లి వైద్యుడి పరిశీలన అనంతరం వారం లోగా ఆన్‌లైన్‌లో ధ్రువపత్రం మంజూరవుతుంది. ఈ విధానంలో వైద్యుల నిర్లక్ష్య ధోరణితో చాలామంది దివ్యాంగులకు నిరాశ ఎదురవుతోంది. ఒకసారి ఆన్‌లైన్‌లో తమ పేరు కనిపించకపోవడంతో మళ్లీ కాళ్లీడ్చుకుంటూ మూడు చక్రాల బండ్ల మీద, ఇతరుల సహాయంతో సదరమ్ క్యాంపునకు వస్తున్నారు. రెండోసారి తమ పేరును రిజిస్టర్ చేసుకుంటేనే కానీ ఫలితం ఉండడం లేదు.

కాసులిస్తేనే!

కొందరు వైద్యులు కాసులిస్తేనే సదరస్ ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారని, లేకపోతే ఇష్టం వచ్చినట్లు తిప్పుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

లంచం అడిగితే నాకు తెలపండి



"దివ్యాంగులకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో సదరస్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. దీనికి జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో దివ్యాంగులు వస్తున్నారు. వారికి ఆసుపత్రి వెనుక వైపు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం. అయితే దానిని వినియోగించుకోవడం లేదు. వైద్యులకు ఓపీ, సదరస్ క్యాంపు చూసేందుకు చాలా సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో కొంత ఇబ్బంది అవుతుంది. ధ్రువపత్రం జారీ చేసేందుకు వైద్యులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే నా దృష్టికి తీసుకురండి, వెంటనే చర్యలు చేపడతాం."

– డాక్టర్ సూర్యప్రభ, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్

క్యాంపునకు సంబంధించి రాజమహేంద్రవరం, కాకినాడ జీజీహెచ్‌లోనే స్లాట్లు అందుబాటులో ఉంటాయి. మిగిలిన ప్రాంతాల్లో అతి తక్కువ మందికి మాత్రమే స్లాట్లు రావడంతో అందరూ రాజమహేంద్రవరం జీజీహెచ్‌కే వస్తున్నారు. అలాగే క్యాంపునకు వచ్చే వారికి ప్రత్యేక ఏర్పాట్లు ఏమీ చేయడం లేదు. సాధారణ ఓపీ రోగులతో పాటు వీరూ వైద్యుని గది బయట గంటల తరబడి ఉండాల్సిందే. వీరికి ప్రత్యేక వైద్యుడు, ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయలేదు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



మాట్లాడుతున్న సత్య శ్రీనివాస కుమారి

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక రాజమహేంద్రవరంలో మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘ అధ్యక్షురాలిగా కొమండూరి సత్య శ్రీనివాస కుమారి, ప్రధాన కార్యదర్శిగా పరాంకుశం ప్రమీల, కోశాధికారిగా రామాయణం పుష్ప, సభ్యులుగా 12 మందిని నియమించారు. ఈ సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షురాలు సత్య శ్రీనివాస కుమారి తెలిపారు. 2024 జనవరి 7వ తేదీన ఏవీ అప్పారావు రోడ్డులోని ప్రభుగారి తోటలో ధనుర్మాస వనసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధి మేట్లకు శిక్షణ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ మేట్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలతో సక్రమంగా పనులు చేయించాలన్నారు. వారు రోజుకు రూ.272 అందుకునేలా చూడాలన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రోజుకు రెండుసార్లు హాజరు పంపాలని సూచించారు. మూడు బ్యాచ్‌లకు గురువారం వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగేశ్వరవేణి, టెక్నికల్ అసిస్టెంట్లు ఏఆర్‌బీ చక్రవర్తి, సుదర్శన్, కంప్యూటర్ ఆపరేటర్ మొహిద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మహిళా సాధికారత



గాదరాడలో జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

మధురపూడి: జగనన్న ప్రభుత్వంలోనే మహిళా సాధికారిత సాధ్యమవుతోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం నర్సాపురం, గాదరాడ గ్రామాల్లో మంగళవారం డ్వాక్రా, ఎన్ఆర్ఈజీఎస్ మహిళలతో గ్రీవెన్స్ సమావేశం జరిగింది. విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా, సామాజికపరంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు జరుపుతున్న నవరత్నాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించారన్నారు. డ్వాక్రా, ఉపాధి మహిళల సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకులు హరిబోలు చినబాబు, మారిశెట్టి తేజోనాయుడు, శ్రీను, వెఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) ఏపీఎం ఎ.జయంతి రాజ్, గ్రామ సమాఖ్య అధ్యక్షులు అప్పలనర్స పాల్గొన్నారు.

రైల్వేశాఖ సానుకూల స్పందన సంతోషకరం



అన్నపూర్ణమ్మ గేట్ ప్రాంతం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్

- ఎంపీ భరత్ రామ్
- అన్నపూర్ణమ్మపేట రైల్వే క్రాస్‌గేట్ పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక అన్నపూర్ణమ్మపేటలోని రైల్వేక్రాస్ గేట్ వల్ల ప్రజలు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని, ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆర్‌యూబీ నిర్మించాలని ప్రతిపాదన చేయగా అందుకు రైల్వేశాఖ సానుకూలంగా స్పందించడం సంతోషకరమని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయన మంగళవారం రైల్వే ఇంజినీరింగ్, రెవెన్యూ, ఆర్ఎంసీ, పీఆర్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులతో కలిసి అన్నపూర్ణమ్మపేట ఆర్ఎల్సీ గేట్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గేట్ మూసివేసి, అక్కడ ఎటువంటి వంతెన నిర్మించాలి, ఎన్ని ఇళ్లకు, దుకాణాలకు, బిల్డింగులకు ఏమేర ఎంత నష్టం జరగవచ్చో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అన్నపూర్ణమ్మ రైల్వే క్రాసింగ్ దగ్గర ఎఫ్ఓబీ లేదా ఆర్‌యూబీ నిర్మించాలా అనేది రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంటుందన్నారు. అలాగే కేశవరం రైల్వే క్రాసింగ్ వద్ద, జేగురుపాడు దగ్గర ఆర్‌యూబీ, అనపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్రాసింగ్ వద్ద వంతెనలు నిర్మించబోతున్నట్లు తెలిపారు. వీటి నిర్మాణానికి సాధ్యమైనంత త్వరలో శంకుస్థాపనలు చేపడతామన్నారు. అన్నపూర్ణమ్మపేట రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మించడం వల్ల తమ ఇళ్లకు నష్టం జరుగుతుందని చాలామంది తన వద్ద ఆందోళన వ్యక్తం చేశారన్నారు. అటువంటి అపోహలేమీ వద్దన్నారు. నష్టం వచ్చే వారికి మూడింతలు నష్టపరిహారం అందించే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విజయవాడ గతిశక్తి రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు అన్నే బాబూరావు, బి.రాజేంద్రప్రసాద్, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరి, ఏసీపీ వరహాల బాబు, సర్వేయర్ అనిత, ఆర్అండ్‌బీ ఈఈ తల్లెం సత్యనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల అభివృద్ధి



సమావేశంలో చర్చిస్తున్న జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఆవ వాంబే కాలనీలోని వంద అడుగుల రోడ్డును అనుసంధానించే రహదారులను మాస్టర్ ప్లాను ప్రకారం అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం, రుడా అధికారులను జేసీ తేజ్‌భరత్, నగర కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం, రుడా సర్వేయర్లు, గ్రామీణ సర్వేయర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగరంలో వివిధ రోడ్లను మాస్టర్ ప్లానుకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా స్టేడియం నుంచి మోరంపూడి వరకూ ఉన్న రోడ్డును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మోరంపూడి రోడ్డుకు సమాంతరంగా తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకూ 100 అడుగుల రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. కాగా.. మోరంపూడి రోడ్డు నుంచి 100 అడుగుల రోడ్డును కలిపేలా మాస్టరు ప్లాన్‌లో వెంకటేశ్వర జనరల్ మార్కెట్ నుంచి ఎస్‌టీపీ వరకూ 60 అడుగులు, మోరంపూడిని ఆనుకొని ఎస్‌టీపీ వరకూ 40 అడుగుల రోడ్డును ప్రతిపాదించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి కొంత భూమి సేకరించాల్సి ఉందన్నారు. సమావేశములో ఆర్‌డీఓ చైత్రవర్షిణి, రుడా వీసీ బాలస్వామి, పీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మెరుగైన వైద్యం



ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- సీఎం జగన్ నిర్ణయం చారిత్రాత్మకం
- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ఎక్కడా లేని విధంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో కుటుంబానికి రూ.25 లక్షలు వైద్యం కోసం కేటాయిస్తూ ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 44వ డివిజన్లో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి బూరాడ కృష్ణ మాధురి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యానికి జగన్ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. నాడు – నేడు కార్యక్రమంలో పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జనవరి ఒకటి నుంచి ప్రారంభమవుతుందన్నారు. సీఎంగా జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, క్లస్టర్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం జగన్



వేమగిరిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి



పిడింగొయ్యిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేస్తున్న విష్ణుమూర్తి

కడియం: పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. మండలంలోని వేమగిరి సచివాలయం – 1 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను చక్రవర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లజపతిరాయ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, పార్టీ నాయకులు చిలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. పిడింగొయ్యి గ్రామ సచివాలయం–2లో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును, మానమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను సచివాలయం కన్వీనర్లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అరవింద్ నగర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ మస్తాన్, జగపతిరాజు, కోశాధికారి శరభవరావులను కలిసి వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు పదాల వీరరాఘవ రెడ్డి, సిరసపల్లి శంకర్, కణితి లక్ష్మీనారాయణ, మండల క్రిస్టియన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు చీరా రాజు, మాజీ ఎంపీటీసీ పిల్లా లక్ష్మణరావు, ఇబ్రహీం, లోకేష్, మోహ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల ప్రదర్శన

ప్రకాశం నగర్: వెంకటాపురంలోని బైబిలు మిషను సీయోను ప్రార్థనా మందిరం షారోను గృహంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పి.ఎర్నెస్ట్ మోజెస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలతో శాంతి, సమాధానం లభిస్తుందన్నారు. వ్యవస్థాపకుడు డాక్టర్ గారపాటి ఎలిజబెత్ మాట్లాడుతూ శత్రువులను సైతం క్షమించి, ప్రేమించే గుణం ఏసుకీస్తులో చూడగలమన్నారు. క్రిస్మస్ సందేశాన్ని డాక్టర్ సునీత సిన్హా కోమనపల్లి అందించి, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చిన్నారుల ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వై.సోలమన్‌రాజు, కె.విజయరాజు, మహిమరాజు, పి.లాజర్, పి.సుధాకర్ పాల్గొన్నారు.

జనవరి 27, 28 తేదీల్లో బాలోత్సవం



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తిరుమలరావు, ఆకుల వీర్రాజు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి బాలోత్సవాన్ని విజయవంతం చేయడానికి సమష్టిగా కృషి చేయాలని తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజ్‌లో 2024 జనవరి 27, 28 తేదీల్లో జరిగే గోదావరి బాలోత్సవం 2వ పిల్లల పండగ బ్రోచర్ ఆవిష్కరణ సభను మంగళవారం సాయంత్రం స్థానిక హోటల్ షెల్టాన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుమలరావు మాట్లాడుతూ గోదావరి బాలోత్సవం వంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ గోదావరి బాలోత్సవం కార్యక్రమం మంచి కార్యక్రమమన్నారు. సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, స్వర్ణాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ రాజు, సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్, ఉపాధ్యాయ సంఘ నేత రూపస్, రైజింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు మోటూరి సిద్ధార్థ, స్వామియాడ్స్ అధినేత భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూపానగర్ అభివృద్ధికి కృషి

రాజానగరం: రాజమహేంద్రవరం నగరానికి అత్యంత చేరువలో ఉన్న రూపానగర్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రూపానగర్‌లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూనే, గడచిన నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందించిన సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల ద్వారా తెలియజేశారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు కేవలం రూ. 54 లక్షలు వెచ్చిస్తే, తాము అధికారంలోకి వచ్చాక రూ. 13.20 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ ప్రాంతంలో హైటెన్షన్ వైర్లు ఎక్కువగా ఉండటంతో లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉంటుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులను పిలిచి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని సూచించారు. త్వరలోనే అర్హత ఉన్నవారందరికీ నివాస స్థలాలు అందజేస్తామన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ), మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ (ఎంపీఎఫ్‌సీ) పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజభరత్ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం ఆయా నిర్మాణాలను సందర్శించి, వాటి పనుల ప్రగతిపై స్థానిక అధికారులతో సమీక్షించారు. పనులకు సంబంధించిన చెల్లింపులలో ఏమైనా ఇబ్బందులుంటే చెప్పాలన్నారు. రూ.15.74 లక్షలతో నిర్మిస్తున్న బీఎంసీయూ పనులను సత్వరమే పూర్తి చేయాలని, జనవరి 2లోగా యూనిట్‌ను ప్రారంభించాలన్నారు. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ఎంపీఎఫ్‌సీ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని అధికారులు ఆయనకు వివరించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ ఏబీవీ ప్రసాద్, ఏఈ సంపత్‌కుమార్, ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం, డీటీ సునీత పాల్గొన్నారు.

పోటీల విజయవంతంపై అభినందనలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ 2023 – 24 పోటీలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన అందరికీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ ఔనత్యానికి ప్రతీకగా ఈ పోటీలు నిలిచాయంటూ ఇక్కడకు దేశంలోని 11 రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రశంసించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

రాజానగరం: నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ మంగళవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, మీకు అండగా జక్కంపూడి కుటుంబం ఉందంటూ భరోసానిచ్చారు. బ్రెయిన్ సర్జరీ చేయించుకుని కలవచర్లలో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న పి.కన్నారావు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామపురానికి చెందిన అడబాల వీరన్నలను పరామర్శించారు.